# అ(న)సూయ మొగుడు

అందంగా ఆనందంగా జరిగిపోయింది అనసూయ పెళ్ళి. పెళ్ళికని వచ్చిన లలితపిన్ని మాత్రం చిలిపి సందేహం లేవదీసింది. "అక్కా! దీన్ని మరీ అంత అందగాడికిచ్చి పెళ్ళి చేశావ్, ఎలాగే" అంది.

అర్థం కానట్టు చూసింది అనసూయ తల్లి హైమవతి.

"దీని చిన్నప్పుడు పుట్టిన రోజుకి నేనో వెండి గ్లాసు చేయించి యిస్తే దాంతో తమ్ముడు పాలు తాగేడని ఎంత పేచీ పెట్టేసిందో గుర్తుందా?" జ్ఞాపకం చేసింది లలిత.

"జ్ఞాపకం లేకేం. గోడకేసి కొట్టిన ఆ గ్లాసు సొట్టలు పడి ఇప్పటికీ ఉంది" అని నవ్వింది హైమవతి.

"మరీ ఇంత అందగాడు మొగుడైతే రోడ్డుమీద ఎవరైనా కన్నెత్తి చూస్తే ఊరుకుంటుందా? నా మొగుడు నా సొంతం అని బురఖా వేసి నడిపిస్తుందేమో" అంది అనసూయ వేపు చిలిపిగా చూసిన లలిత. అంతా పగలబడి నవ్వితే- "పో పిన్నీ నువ్వెప్పుడూ ఇంతే" అని చిరుకోపంతో బుంగమూతి పెట్టింది అనసూయ. భర్తతో కలిసి షాపింగ్‌కీ, సినిమాకీ బయలుదేరుతున్న సందడిలో అంతకన్నా ఎక్కువ జోక్యం కలిగించుకోలేదు పిన్ని చేసిన వేళాకోళానికి.

రవి అందాన్ని మెచ్చుకున్న లలితపిన్ని మాటలు నిజానికి అనసూయ మనసులో ఎంతో తృప్తీ, గర్వం కలిగించాయి. ఒత్తయిన నల్లని జుత్తూ, ఎత్తయిన తెల్లని విగ్రహం, గొంతులో గాంభీర్యం, నడకలో ఠీవీ తలుచుకుంటూ అతనితో తన అడుగులు కలుపుతూ జనరల్ పోస్టాఫీస్ ముందుగా పోతున్న అనసూయ పాదాలు నేలకానడం లేదు. కొత్త పెళ్ళికూతురులో సహజంగా ఉండే థ్రిల్ ఆమె ప్రతీ కదలికలోనూ ఒయ్యారాన్ని ఒలికిస్తోంది. తనకన్నా రెండు మూడేళ్ళు పెద్దగా ఉన్న స్నేహితురాళ్ళకింకా సంబంధాలే కుదరక అవస్థ పడుతూఉంటే తనకు రవితో పెళ్ళి జరగడం ఎంతో గర్వంగా ఉంది. వెయ్యి కళ్ళతో ప్రపంచమంతా తామిద్దరినే చూస్తున్న భ్రాంతి- తన నడకలో కాసింత తడబాటు కలిగిస్తోంది. దీపం ప్రమిద

కింద క్రీనీడలాగ అంత తృప్తిలోనూ కాసింత అసంతృప్తి లేకపోలేదు. అంతా రవి అందాన్ని మెచ్చుకుని అదృష్టవంతురాలివే అని అభినందిస్తున్నారే కానీ నీకు తగిన జోడు అని ఎవ్వరూ అనరేం అని అనుకుంటూ తన కంటిమీదకు వచ్చి పడుతున్న ముంగురుల్ని సున్నితంగా పక్కకు నెట్టింది.

పోస్టాఫీసు కనిపించగానే తను పోస్టల్ ఆర్డర్స్ కొనుక్కోవాలన్న మాట జ్ఞాపకం వచ్చింది. లోపలకి రవిని తీసుకుపోతూ "ఒక్క నిమిషం ప్లీజ్, పోస్టలార్డర్స్ కొనుక్కుని వచ్చేస్తా. ఇక్కడ కూర్చోండి" అని హాల్లో విజిటర్స్ కోసం వేసిన బెంచీఒకటి చూపించి హడావిడిగా కౌంటర్ వేపు సాగిపోయింది. తొందరగా పోవాలనుకున్నప్పుడే కౌంటర్ దగ్గర ఎక్కడలేని రద్దీ ఉంటుంది కాబోలు అనుకుంది విసుగ్గా. ఆరుగురు జెంట్స్ ఇద్దరు లేడీస్ వేరువేరుగా క్యూలు కట్టి నిలబడ్డారు. తనూ వెళ్ళి వెనకాల నిలుచుంది. కౌంటర్‌లో కూర్చున్నవాడికి ఈ లోకంమ్మీద బోలెడు కసిగా ఉన్నట్టుంది, చీమలాగా నెమ్మదిగా కర్తవ్యపాలన చేస్తున్నాడు.

పోస్టలార్డర్స్ ఎంచుకుని బ్యాగులో పెట్టుకుని అనసూయ వచ్చేసరికి, ఎంతలేదన్నా పది నిమిషాలు దాటింది. రవికి ఏం తోచక విసుక్కుంటాడేమో అని తొందర పడుతూ వచ్చి రవి దగ్గర పక్కగా నిల్చుంది. అతని ఏకాగ్రత దూరాన నిలుచుని మని ఆర్డర్ ఫామ్ నింపుతున్న అమ్మడుమీద ఉంది. సున్నితంగా వీణ మీటినట్లు కదుల్తున్న ఆ మునివేళ్ళను చూస్తున్నాడు. ఆ అమ్మడేమో పాలరాతి శిల్పంలా నిల్చుంది.

అనసూయ అసహనంగా పొడి దగ్గు తెచ్చిపెట్టుకునిమరీ దగ్గింది, రవి తన ఉనికిని గుర్తించాలని. రవి పరధ్యానంగా ఉన్నాడనుకోగానే మొహం కందగడ్డలా ఎర్రబడిపోయింది. "పదండి పోదాం. ఇక్కడే ఉండిపోయేటట్టున్నారు చూస్తే" అంది. కాస్త కఠినంగా. అనసూయ మాటల్లో అసాధారణంగా ధ్వనించిన కాఠిన్యానికి విస్తుపోయి అయోమయంగా చూశాడు రవి. "పదండి పోదాం" అంది ఉక్రోషం ఆపుకుంటూ. "అలాగే, ఒక్క నిముషం" అన్నాడు ఎంతో సౌమ్యంగా కాసింత దూరాన ఉన్న ఆ అమ్మాయి వేపు చూస్తూ. ఇక ఊరుకోలేక పోయింది అనసూయ. "ఆ అమ్మాయి మీకు తెలుసేంటి?" అంది చురుగ్గా. "అబ్బే నాకేం తెలుసు. ఆవిడ చేతిలో పెన్ను నాది" అన్నాడు అమాయకంగా.

(ఆదివారం ఉదయం 15-11-1992))

ఎ.పి. గ్రం... ...యం, కడప.
ప్ర... 14132
Acc. No.....................
తేది.........................